క్లుప్తంగా

ఇచ్చోడలో వర్షం


ఇచ్చోడలో కురుస్తున్న వర్షం

ఇచ్చోడ: మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. 5 గంటల ప్రాంతంలో ఉరుములు మెరుపులతో 20 నిమిషాల పాటు వర్షం పడింది. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జాగృతి అధ్యక్షుడు


కవితతో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో తన కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. భారత సైనికులకు సంఘీభావంగా జాగృతి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించినట్లుగా ఆయన తెలిపారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: వేసవిలో చిన్నారులను ఆధ్యాత్మికత వైపు తీసుకెళ్లాలనే ఆలోచనతో వేసవి శిబిరాన్ని నిర్వహించామని ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి ప్రణవానంద ప్రభూజీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ముంబాయి జిన్నింగ్‌లోని ఇస్కాన్ ఆలయంలో గత రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. పిల్లలకు ఆధ్యాత్మిక క్రీడలు, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి అంశాలపై శిక్షణనిచ్చారు. శిక్షణలో సుమారు వంద మంది పిల్లలు హాజరయ్యారు. ముగింపు సందర్భంగా శ్రీకృష్ణుడి ప్రవచనాలతో పాటు గీతాలు ఆలపించారు. ఆదివారం లక్ష్మీనర్సింహస్వామి చతుర్థి సందర్భంగా ఇస్కాన్ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పూజారి తెలిపారు.

హజ్ యాత్రికులకు సన్మానం

కైలాస్‌నగర్: హజ్ యాత్రకు వెళ్లే వారిని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి శనివారం ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఈద్గా మైదాన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముస్లింలను సత్కరించారు. అంతకుముందు యాత్రికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ జహీర్ రంజాని, నాయకులు ఎం.ఏ షకీల్, ముజాహిద్దీన్, మొహమ్మద్ రఫీక్, షేక్ ఖలీం, అంజద్ ఖాన్, తోఫిక్, అస్బాత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ రావు జయంతి

బోథ్: మండల కేంద్రంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల విశ్వేశ్వర రావు జయంతిని శనివారం మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం మండల అధ్యక్షులు ఎలుక రాజు, కోశాధికారి బోడ లక్ష్మణ్, బోథ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేందర్, జనరల్ సెక్రెటరీ ఉషన్న, రవి, రమేశ్, రాజు, భోజన్న కుల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన అశోక్‌కుమార్ అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ నెల 4న ఇంట్లో నుంచి బయలుదేరిన యువకుడు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు ఎక్కడ గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

టీడీపీ కన్వీనర్‌గా శివారెడ్డి

బోథ్: బోథ్ మండల టీడీపీ కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన మల్లెపూల శివారెడ్డి నియమితులయ్యారు. సొనాల మండల కన్వీనర్‌గా మహబూబ్ బేగ్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్, పరిశీలకులు అల్లూరి రాజారెడ్డిలు నియామకపత్రాన్ని అందించారు.

‘ఉగ్రవాదానికి ఇకనైనా ముగింపు పలకాలి’

ఆదిలాబాద్‌టౌన్: భారత్, పాకిస్తాన్ మధ్య కొద్ది రోజులుగా జరుగుతున్న కాల్పులకు విరమణ ప్రకటించడం హర్షణీయమని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ప్రకటించిన నేపథ్యంలో ఉగ్రవాదంపై ఇక నుంచైనా కఠిన వైఖరి వహించాలని పేర్కొన్నారు. పహెల్గాంలో జరిగిన దాడులకు భారత్ దీటైన జవాబు ఇచ్చిందని, భారత సైన్యం యుద్ధభూమిలో తన సత్తా చాటిందని పేర్కొన్నారు. సైన్యం పాకిస్తాన్‌కు తనదైన శైలిలో గుణపాఠం చెప్పిందన్నారు.

మొగులు.. గుబులు

- మబ్బులతో అన్నదాత ఆందోళన
- భారీ వర్షం పడితే పంటలకు నష్టం
- అధికంగా వేరుశనగ, జొన్న పంటలు సాగు


వ్యవసాయ పొలంలో ఆరబెట్టిన వేరుశనగ పంట

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆదిలాబాద్‌రూరల్, మావల, జైనథ్, బేల మండలాల్లో ఎండాకాలంలో శనగ, వేరుశనగ పంటలు అధికంగా సాగు చేస్తుంటారు. పత్తి దిగుబడులు రాని రైతులు సైతం రబీలో వేరుశనగతో పాటు జొన్న పంటలు సాగు చేస్తారు. అయితే కొద్దిరోజులుగా మేఘాలు కమ్ముకోవడం, ఈదురుగాలులు వీస్తుండడం, శనివారం వర్షం కురవడంతో రబీలో వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు కురిస్తే తమకు తీవ్ర నష్టం జరుగుతుందని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువులకు మేతగా..

వేసవికాలంలో పశువులకు మేత అంతంత మాత్రంగానే లభ్యమవుతుంది. వానాకాలం ప్రారంభంలో సైతం పశువులకు మేత దొరకడం కష్టంగా మారింది. రబీలో వేరుశనగ సాగు చేసి రైతన్నలు వేరుశనగ మొక్కలను పశువుల మేతగా వినియోగిస్తుంటారు. ఈ మేత కొనుగోలు చేయడానికి పశుపోషకులు ఆసక్తి కనబరుస్తుంటారు. ఒకవేళ వర్షం కురిస్తే ఆ వేరుశనగ మేత పశువులు తినడానికి పనికి రాకుండా నేలపాలవుతుందని రైతులు పేర్కొంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి మేఘాలు కమ్ముకోవడం, ఈదురు గాలులు వీస్తుండడం, శనివారం వర్షం కురవడంతో తక్కువ ధరకు పంట విక్రయిస్తున్నామని పలువురు వేరుశనగ సాగు చేస్తున్న రైతులు పేర్కొంటున్నారు. వర్షం కురిస్తే పల్లీలు తడిసి బూజు పట్టే అవకాశం ఉందని, వాటిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కూడా ఆసక్తి చూపరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

500 ఎకరాల్లో వేరుశనగ సాగు..

వానాకాలంలో పత్తి పంటలకు అంతంత మాత్రంగానే దిగుబడి వచ్చినా, సోయాబీన్ పంట వేసిన రైతులు రబీలో జొన్న పంటతో పాటు వేరుశనగ పంట సాగు చేస్తుంటారు. అయితే రబీలో జొన్న పంట 43వేల ఎకరాలకు పైగా సాగు కాగా వేరుశనగ పంట సుమారు 500 ఎకరాల వరకు సాగవుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వేరుశనగ పంట కోత దశలో ఉందని, వర్షం పడి తడిసిపోతే వేరుశనగ మేతకు కూడా పనికి రాకుండా పోతుందని పేర్కొంటున్నారు. అలాగే జొన్న పంట మరి కొంత కోతకు గురి కావాల్సి ఉందని, వర్షం పడితే జొన్న నల్లపడి ధర తక్కువగా పలుకుందని ఆందోళన చెందుతున్నారు.

తక్కువ ధరకు విక్రయిస్తున్న..



నాకు ఉన్న మూడెకరాలలో వేరుశనగ పంట సాగు చేసిన. ప్రస్తుతం వేరుశనగ కోత పూర్తయ్యింది. గత నాలుగైదు రోజుల నుంచి మబ్బులు కమ్ముకుంటున్నాయి. వర్షం పడి వేరుశనగ మేత నానిపోతే పనికి రాదు. దీంతో ఆ మేతను తక్కువ ధరకు విక్రయించుకోవాల్సి వస్తోంది.
– రామన్న, రైతు, బూర్నూర్, ఆదిలాబాద్‌రూరల్

వారంలో కోత పూర్తి

రబీలో జొన్నతో పాటు కొంతమంది రైతులు వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 80శాతం వరకు జొన్న పంట కోత పూర్తయ్యింది. వేరుశనగ పంట కోత దశలో ఉంది. వర్షానికి వేరుశనగ మేత తడిసిపోతే పశువులకు మేతకు పనికి రాదు. మరో వారం రోజుల్లో వేరుశనగ పూర్తవుతుంది.
– నాగేశ్వర్ రెడ్డి, ఏవో, ఆదిలాబాద్‌రూరల్

డిగ్రీ పరీక్షలు జరిగేనా..?

- ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడ్డ పరీక్షలు
- రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని ప్రైవేట్ యాజమాన్యాల డిమాండ్
- పరీక్షలు ఆలస్యం కావడంతో అయోమయంలో విద్యార్థులు
- అకాడమిక్ ఆలస్యమవుతుందని ఆందోళన


కాకతీయ యూనివర్సిటీ

బోథ్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలపై సందిగ్ధత నెలకొంది. పరీక్షలు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉండగా, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు సహకరించకపోవడంతో పరీక్షలు రెండుసార్లు వాయిదా వేశారు. యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2, 4, 6 (రెగ్యులర్), 1, 3, 5 (బ్యాక్‌లాగ్) సెమిస్టర్ పరీక్షల కోసం యూనివర్సిటీ అధికారులు అన్ని సిద్ధం చేశారు. అయితే రెండుసార్లు పరీక్షలు వాయిదా పడ్డాయి. తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు బకాయిలు చెల్లిస్తేనే పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. దీంతో యూనివర్సిటీ అధికారులు పరీక్షలను వాయిదా వేస్తూ వస్తున్నారు.

పరీక్ష ఫీజులు చెల్లించని ప్రైవేట్ కళాశాలలు..

డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్‌లతో పాటు 1, 3, 5 సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్షల నిర్వహణకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని యూనివర్సిటీ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. కళాశాలల్లో విద్యార్థులు పరీక్ష ఫీజులు సైతం చెల్లించారు. విద్యార్థులు చెల్లించిన పరీక్ష ఫీజులను కొన్ని ప్రైవేట్ కళాశాలలు యూనివర్సిటీకి చెల్లించకపోవడంతో గత నెల 21వ తేదీన జరగాల్సిన పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. మళ్లీ 28వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు టైంటేబుల్‌ను విడుదల చేశారు. అయితే అప్పటికీ పరీక్ష ఫీజులను కొన్ని కళాశాలలు చెల్లించకపోవడంతో మళ్లీ వాయిదా వేశారు. తాజాగా మే, 14వ తేదీ నుంచి మళ్లీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఈ మేరకు పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఈసారి విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లించిన కళాశాలలకు మాత్రమే పరీక్షలు ఉంటాయని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్ తెలిపారు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఆదిలాబాద్ జిల్లాలో కేవలం ఒక ప్రైవేట్ కళాశాల మాత్రమే విద్యార్థుల ఫీజు చెల్లించినట్లు సమాచారం.

అప్పుల ఊబిలో ప్రైవేట్ కళాశాలలు..

జిల్లాలో 2021 నుంచి ఫీజు బకాయిలు రాక ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నాయి. నాలుగేళ్ల నుంచి దాదాపు 50శాతం ఫీజు బకాయిలు రాలేదని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తామని హామీలు ఇచ్చినా, చెల్లించడం లేదని చెబుతున్నారు. కళాశాల నిర్వహణ భారంగా మారిందని, ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయామని పేర్కొంటున్నాయి. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి పైసా ఇవ్వలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. అధ్యాపక వేతనాలు, భవనాల అద్దెలు, విశ్వవిద్యాలయ ఫీజులు చెల్లించటం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. తమకు ఫీజు బకాయిలు చెల్లిస్తేనే పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని పేర్కొంటున్నాయి.

ట్రాక్టర్ ట్రాలీ పైనుంచి పడి వ్యక్తి మృతి


పింగాడె దత్తు (ఫైల్)

బోథ్: మండల కేంద్రానికి చెందిన పింగాడె దత్తు (47) అనే వ్యక్తి నడుస్తున్న ట్రాక్టర్ ట్రాలీ పైనుంచి పడి మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దత్తు మహారాష్ట్ర నుంచి 25 సంవత్సరాల క్రితం బోథ్ మండల కేంద్రానికి వలస వచ్చాడు. ఇక్కడే కూలీ పని చేసుకుంటే జీవనం సాగిస్తున్నాడు. శనివారం దత్తు ఉదయం చేనులోకి కూలీ పనికి వెళ్లాడు. పని పూర్తయిన తరువాత ఇంటికి తిరిగి వస్తుండగా, మార్గ మధ్యలో ట్రాలీలో జొన్నలను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి ఎక్కాడు. బోథ్‌కు వస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంతో నడపడంతో ట్రాలీలో కూర్చున్న దత్తు రోడ్డుపై పడిపోయాడు. దీంతో ట్రాలీ టైరు దత్తు తలపై నుంచి వెళ్లింది. దీంతో ఆయనకు తీవ్ర రక్తస్రావమైంది. కాగా స్థానికులు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా దత్తు మృతిచెంది ఉన్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై వివరాలను నమోదు చేసుకుని, మృతుడి బావ బబుల్‌కర్ సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బస్టాండ్‌లో వసతులేవి?


నిరుపయోగంగా మూత్రశాలలు

ఇచ్చోడ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు కరువయ్యాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇచ్చోడ బస్టాండ్ నుంచి ప్రతీ రోజు నిర్మల్, హైదరాబాద్, ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని చంద్రపూర్, యావత్మల్, నాగ్‌పూర్ లాంటి ప్రాంతాలకు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.
– ఇచ్చోడ

నూతన ఎస్సైని సన్మానించిన బీజేపీ నాయకులు


ఎస్సైని కలిసిన బీజేపీ నాయకులు

సిరికొండ: నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీసాయిని శనివారం పోలీస్‌స్టేషన్‌లో మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ నూతనంగా వచ్చిన ఎస్సైకి పార్టీ తరఫున ఎల్లప్పుడు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, మాజీ ఎంపీపీ పెందుర్ అమృత్ రావు, మాజీ కోఆప్షన్ సభ్యులు మాణిక్‌రావు, నాయకులు పెంట గంగాధర్, భగవంత్, సిడాం నాగోరావు, మారుతి పాల్గొన్నారు.

విద్యానైపుణ్యాలు పెంపునకు సమ్మర్ క్యాంపు


విద్యార్థులకు బోధిస్తున్న ఎంఈవో అనిత

నార్నూర్: విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంచడానికి సమ్మర్ క్యాంప్ ఎంతో దోహదపడుతాయని ఎంఈవో పవార్ అనిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఎస్‌సీఈఆర్‌పీ వినోద్, ఉపాధ్యాయుడు జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో సీఆర్పీఎఫ్ జవాన్ మృతి


మేఘనాథ్ (ఫైల్)

బజార్‌హత్నూర్: జార్కండ్ రాష్ట్రంలోని రాంచీ సీ ఆర్ ‌పీఎఫ్ క్యాంపులో మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ అర్క మేఘనాథ్(40) అనారోగ్యంతో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అర్క మేఘనాథ్ 2007లో సీఆ ర్పీఎఫ్ జవాన్‌గా ఉద్యోగంలో చేరారు. గత రెండు సంవత్సరా లుగా ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌తో ఇబ్బంది ప డు తున్నాడు. శనివారం ఉదయం డ్యూటీలోకి వెళ్లే సమయంలో నోటి నుంచి రక్తం రావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మ మత, ఇద్దరుకు మారులు నితేశ్, రితేశ్, కూతు రు పవిత్ర ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన దొంతుల రుక్మాబాయికి చెందిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. శనివారం నేరడిగొండలోని ఎమ్మెల్యే నివాసంలో రూ.60వేల విలువ గల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. షేక్ అఫ్రోజ్, మహేందర్, సుభాష్ ఉన్నారు.


ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

రథోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో సోమవారం నిర్వహించే గోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవానికి రావాలని గ్రామస్తులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరమరణం పొందిన జవాన్‌కు నివాళి


క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఇండియా, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు శనివారం రాత్రి మండలకేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా మండల కేంద్రంలోని తెలంగాణ తల్లిచౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. మారు తి డొంగ్రె పటేల్, కనక తుకారం, అనిల్ రాథో డ్, జహీర్, జునైద్, బాలు కేంద్రే, ముండే బా బు ఉన్నారు.

సైన్యం కోసం ప్రత్యేక పూజలు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో భారతదేశ సైన్యం పాకిస్తాన్‌పై జరుపుతున్న యుద్ధం విజయం సాధించాలని బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సైనికులకు మద్దతుగా రేపు సంఘీభావ ర్యాలీ


పార్టీ శ్రేణులతో సమీక్షిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పాక్ ఉగ్రవాద చర్యలను తిప్పికొట్టే క్రమంలో అమరులైన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించడం, యుద్ధంలోని సైనికులకు సంఘీభావం తెలిపేలా ఈనెల 12న ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ర్యాలీ ఏర్పాట్లపై పార్టీ నాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జాతీ సమైక్యత జాతీయవాదాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు అలాల్ అజయ్, యూనీస్ అక్బానీ, మెట్టు ప్రహ్లాద్, ప్రకాశ్, పవన్ నాయక్, సాజిదొద్దీన్, పండ్ల శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఈ తిరుపతి రెడ్డి, సిబ్బంది

తాంసి: విద్యుత్ ప్రమాదాలపై విద్యుత్ వినియోగదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీంపూర్ విద్యుత్‌శాఖ ఏఈ తిరుపతి రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని నిపాని సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో కలిసి విద్యుత్ ప్రమాదాల నివారణ పోస్టర్ ఆవిష్కరించారు. ఏఈ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వాడకంలో తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎక్కడైనా లూజ్ విద్యుత్ తీగలు ఉంటే సిబ్బంది తెలియజేసి మరమ్మతులు చేయించుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్, రాజు, వెంకట్ తదితర సిబ్బంది ఉన్నారు.

పల్లె ప్రకృతివనంలో పిచ్చిమొక్కలు



అధ్వానంగా హర్కపూర్‌అంద్‌గూడ ప్రకృతివనం

ఇంద్రవెల్లి: హరితహారంలో భాగంగా గత ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రకృతి వనాల్లో విలువైన పూలు, పండ్ల మొక్కలు నాటింది. కానీ అధికారులు, పాలకులు ప్రకృతి వనాలపై దృష్టి సారించకపోవడంతో మండలంలోని హర్కపూర్‌అంద్‌గూడ, అంజీ తదితర గ్రామాల్లోని ప్రకృతివనాలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. చెట్లకు నీరు పట్టే వారు లేక చెట్లు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


హర్కపూర్‌అంద్‌గూడ ప్రకృతివనంలో దర్శనమిస్తున్న పిచ్చిమొక్కలు

సమ్మర్ క్రీడాక్యాంప్‌లో పండ్లు పంపిణీ


విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి

ఇచ్చోడ: మండల కేంద్రంలో జిల్లా పరిషత్తు పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్‌క్రీడా క్యాంప్‌లో శనివారం మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ నిమ్మల శివకుమార్‌రెడ్డి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించే సమ్మర్ క్రీడా క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రమణారెడ్డి పాల్గొన్నారు.